కథ

# ప్రోగ్రెస్

పెద్దింటి అశోక్ కుమార్

నేను ఇంట్లోకి అడుగు పెట్టానా .... అప్పటికే నిర్ణయాలన్నీ జరిగిపోయినట్టున్నాయని నా కనిపించింది - అంతకుముందు అక్కడేదో యుద్ధం జరిగిందని మా బావమరిది కూడా అక్కడే ఉన్నాడు. (నా అనుమానమే అది) అతడి మొహంలో ఏదో సాధించిన తృప్తి. మా సుధ మాత్రం ఆందోళనగా ఉంది. నా చిన్నకూతురు శృతి రాజులకు చిక్కిన సైనికుడిలా ఉంది. గోడను ఆనుకుని భయం భయంగా ముడుచుకుని కూర్చుంది.

నన్ను చూసి వాతావరణం మరింత గంభీరంగా మారింది. ఏం జరిగిందని నేను అడగలేదు. ముగ్గురు నా వైపు విచిత్రంగా చూసారు. నాకు అడగాలనిపించలేదు. మౌనంగా ఇంట్లోకి నడిచాను. మొదట్లో ఎవరి మొహంలో ఆందోళన కనిపించినా గాబరా పడేవాన్ని. ఏమిటని అడిగేవాన్ని. వారు చెప్పింది నాకు సమస్యలా అనిపించేదే కాదు.



'ఇంతేనా...;' అనేవాన్ని.

'లోకం పోకడ తెలియదు' అనే వారు.

'ఆగం గాకుండా ఆలోచించాలి' అనే వాన్ని.

'బాధ్యత లేని మనిషి' అనేవారు. మాట పడలేక గాబరా పడ్డట్టుగా నటించే వాన్ని.

'మాటలు... మాటలు కాదు. చేతలు కావాలి' అనేవారు. అలా స్పందించడమే మానేసాను. ఇప్పుడు 'ఏనుగు మీది వాన' అంటున్నారు.

నా మౌనం ఒక్కొక్కరికి ఒక్కొక్క రకంగా అర్థమైనట్టుంది. శృతి తల దించుకుంది. మా బావ మరిది కోపంగా తల ఎగరేసాడు. సుధ మాత్రం తన బాధను నాతో పంచుకోవాలని 'బయటకు వెళ్తే తలకొట్టేసినట్టుంది. ఎవరికి ఏమని చెప్పను' అన్నది బాధగా.

నేను ఎప్పుడూ వినే మాటలే! ఈ మధ్య ఎక్కువగా వింటున్నాను.

మొన్న 'ఫ్లాట్ మోడల్ టీవీ బాగుంది. పాతది మార్చేద్దాం' అంది.

'ఫరవాలేదు నడుస్తుందిగా' అన్నాను. కోపంతో ఈ మాట అనేసింది. సాయంత్రం గోడకు టీవిని మా బావమరిది ఇన్టాగ్రేట్ చేసాడు. ఫ్రిజ్, సోఫా విషయంలో ఇలాగే జరిగింది.

నేను మౌనంగా వారిని దాటుకుంటూ గదిలోకి వెళ్లాను. డ్రెస్ విప్పి లుంగీ కట్టుకున్నాను. మా బావమరిది కోపంగా ఒకసారి నా వైపు చూసి 'అక్కా... నేను వెళ్తున్నాను. ఏ విషయం నాకు కాల్ చేసి చెప్పు. ఒకటి మాత్రం గుర్తుంచుకో... చెయ్యి దాటిపోయాక బాధపడితే లాభం లేదు. కొన్ని నిర్ణయాలు నువ్వు మాత్రమే తీసుకోవాలి' ఒత్తి పలుకుతూ వెళ్లిపోయాడు.

ఆ నిర్ణయమేదో తెలియకపోయినా ఏదో కొంపమీదికి తెచ్చాడని మాత్రం గ్రహించాను. నా జీవితం మీద నాకంటే వాడికే అధికారం ఎక్కువ. ఈ విషయం నాకు తెలియడానికి చాలా రోజులే పట్టింది. అప్పటికి నేను ఎదురు చెప్పలేని స్థితికి వచ్చాను.

ఏడాది కింద వీడు సరిగ్గా నన్ను ఇలాగే చూసాడు. సుధతో ఇలాగే అన్నాడు.

'వీడి మొహం... నన్నుకాదని తీసుకునే నిర్ణయాలేంటే' అనుకున్నాను. కానీ నిజంగానే జరిగి పోయాయి. మా మకాం సిరిసిల్లకు మారిపోయింది. శృతి ప్రైవేట్ స్కూల్లో చేరిపోయింది. పెద్దది కార్పొరేట్ కాలేజీ. క్యాట్ కార్డ్ నా చేతికి వచ్చింది. ఏడు కిలోమీటర్ల ప్రయాణం డెబ్బయి కిలోమీటర్లయింది.

అందుకే భయమేసింది. ఆదరబాదరగా లుంగీని చుట్టుకుంటూ 'సుధా.... ఏమైంది...? వాడేదో నిర్ణయాలంటున్నాడు' అన్నాను బయటకు వచ్చి.

సుధ మాట్లాడలేదు. హుంకరించింది. అప్పుడామె పిల్లలను ఎడబాపుతున్న తల్లి కోడిలా కనిపించింది. శృతి మరింత ముడుచుకుంది. నా వైపు చూడకుండా తలదించుకుంది.

నేను సుధను మరోసారి రెట్టించి అడిగాను.

సమాధానంగా ప్రోగ్రెస్ రిపోర్ట్ నా ముందుంచింది.

నేను విచిత్రంగా చూసాను. సుధ నా వైపు చూస్తూ 'థర్టీపై

ర్యాంక్... అవుటాఫ్ పార్టీ... ఇలాగైతే ఎలా...? లాస్ట్‌యియర్ ఎలాగో గడిచింది. ఇప్పుడు టెంత్...' కోసం దుఃఖం. ఆమె మాటలు ఆగిపోయాయి.

శృతి నా వైపు ప్రొగ్రెస్ వైపు భయం భయంగా చూసింది.

సుధ కొద్దిగా తమాయించుకుని 'లాస్ట్ మంత్ ఏమని ప్రామిస్ చేసింది...? సెకండ్ యూనిట్లో మంచి మార్కులు తెచ్చుకుంటాననలేదూ...! ఏదీ...? ఇప్పుడూ అంతే! ఎందులోనూ పది దాటలేదు' అన్నది.

నేను మార్క్సు చూసాను. అది నిజమే!

నాకు కోపం వచ్చింది. క్షణంలో అది భగ్గుమన్నది. చాచి చెంపమీద కొట్టాలనిపించింది. ఆ పని అప్పటికే చేసినట్టున్నారు. అది కన్నీటితో తడిసి గువ్వపిల్లలా ఒదిగి ఉంది. నాలో మార్పును చూసి మరింతగా ఒదిగి పోయింది.

సుధ నావైపు చూసింది. నాకింకా రావలసినంత ఉద్వేగం రాలేదనుకుంది. నన్ను రగిలించడానికి 'రేపే పేరెంట్స్ మీట్... ఫస్ట్ మీట్‌లో ఎలాగో మేనేజ్ చేసాను. పాపను ఎందుకు చదివించడం లేదని నిలదీస్తారు. ఏమని సమాధానం చెప్పేది. అంత మందిలో పరువు పోతుంది' అన్నది.

ఫస్ట్ మీటింగ్ నాడు కూడా ఇంట్లో ఇలాగే యుద్ధం.

'నేను తిండి కాదు గదా... పచ్చి మంచినీళ్లు ముట్టను. పరువుపోయాక బతుకెందుకు... మా అన్న కూతురు ఐశ్వర్య చూడు. అది స్కూలుకే ఫస్టట. వాళ్లకు ఎంత సంతోషం. రెండు రోజులు నోములకు వెళ్తే అది ఇంట్లో ఒక్కతే ఉందట. ఇది... నేను ఎప్పుడన్నా ఊరికి వెళ్తానంటే చాలు... నా కంటే ముందే రెడీ అయి కూర్చుంటుంది' అన్నది అలిగి.

'మమ్మీ ప్లీజ్... తిను మమ్మీ! నువ్వు తినకుంటే నాన్న తినడు... నేను తినను' శృతి బతిమాలింది.

'తినకపోతే చావండి'... నీకు చదువు కాదు. తిండి ముఖ్యం... నాకు చదువు ముఖ్యం. నీకేం తక్కువ చేస్తున్నాను...? ఏదంటే అది క్షణాల మీద తెచ్చి పెడుతున్నాను' సుధ మరింత కోపంగా.

శృతి ఏడుస్తూ 'మమ్మీ. ప్లీజ్ మమ్మీ... సెకండ్ యూనిట్‌లో బాగా చదువుతాను మమ్మీ...' అన్నది.

'ప్రామిస్' శృతి చేతిని అందుకుంటూ అన్నది సుధ.

వణుకుతున్న చేతులతో శృతి 'ప్రామిస్' అంటూ కన్నీటిని తుడుచుకుంది. అది కొంతైనా మారు తుందని సుధ, అమ్మ శాంతించిందని శృతి కొద్ది సేపట్లో మామూలు మనుషులై పోయారు గానీ నాకు ఆ రాత్రంతా నిద్ర పట్టలేదు.

ఇప్పుడు శృతి మొహం చూసాక నాకోపం ఎప్పుడో ఎగిరిపోయింది. దాని లేత బుగ్గల మీద కన్నీరుచారికలు కట్టింది. సుధ మాటలకు నవ్వాలో ఏడవాలో అర్థం కాలేదు. పల్లెల్లో ఉన్నప్పుడైతే చదువు రావడం లేదని టీచర్స్‌ని అడిగే వాళ్లం. ఇక్కడ అంతా విరుద్ధంగా ఉంది.

ఏదో ఒకటి అనాలని 'సరె సరేలే! ఈ సారి క్వార్టర్లీకి తప్పక కవరవుతుంది' అన్నాను.

అంతే! సుధ పిడుగుపడ్డట్టు అదిరిపడింది. నేను ఆమె నుంచి చూపును చిన్నదానివైపు మరల్చాను. దాని మొహం ఒక క్షణం వెలిగి ఆరిపోయింది.

సుధ కోపంగా ఇంట్లోకి వెళ్లింది. చిన్నది కొద్దిగా భయాన్ని వదిలించుకుని కూర్చుంది. వెళ్తూ వెళ్తూ నన్ను తీక్షణంగా చూసింది సుధ. అప్పటికిగాని ఆమెకు ఇచ్చిన మాట నాకు గుర్తుకు లేదు.

'పిల్లల్ని ముద్దు చేసేటప్పుడు చెయ్యాలి కాదనను. దానికో సందర్భం ఉండాలి. అస్తమానం ముద్దు చేస్తే నెత్తిమీద కూర్చుంటారు' ఒకసారి సుధ నన్ను మందలిస్తూ అన్నది.

'మనకెవరున్నారు సుధా... పెద్దది హాస్టల్‌లోనే! ఇంకో సంవత్సరమైతే ఇది గూడా వెళ్లిపోతుంది. అంతవరకైనా సరదాగా ఉండనీ' నేను అన్నాను.

నా మాటల్ని కొట్టిపడేస్తూ 'మీకు తెలియదు. ఇది డిసిప్లేన్‌కు



సంబంధించిన విషయం. పిల్లల బాగును కోరుకునే తల్లిదండ్రులు ఇవి ఆలోచించరు. ఇలా కాదు. పిల్లల చదువు గురించి మీరైనా పట్టించుకోండి. నేను మౌనంగా ఉంటాను. లేదా నేనైనా పట్టించుకుంటాను. మీరు మౌనంగా ఉండండి' ఉద్వేగంగా అన్నది. ఆమె చాలాసీరియస్‌గా ఉన్నట్టు అర్థమైపోయింది. ఎందుకొచ్చిన గొడవ అనుకుని 'సరే... నేను మౌనంగా ఉంటాను లే' అన్నాను.

'మౌనంగా కాదు. చదువు విషయంలో నేను మందలిస్తున్నప్పుడు మీరు సపోర్టుగా ఉండాలి' మాట తీసుకుంది. అది ఇప్పుడు తప్పినందుకు ఆమెలో కోపం మరింత పెరిగిపోయింది.

ఎలా శాంతపరచాలా అని ఆలోచిస్తుండగా ఇంటి ముందు హారన్ వినిపించింది. మా ఫ్రెండ్ వాసు ఇంట్లోకి అడుగు పెడుతూ ఇది ఉద్యమాల కాలం కాదురా బాబూ... పేరుకే ఫెడరేషన్స్... మెంబర్సంతా బూర్జువాలే... నేత కార్మికులకు మోరల్ సపోర్ట్‌గా ర్యాలీ తీద్దామనుకున్నాం. సమయానికి ఒక్కరు రారు... ఆ కేబుల్ టీవీ పెట్టురా బాబూ' అంటూ తనే రిమోట్ అందుకుని చానల్ మార్చాడు.

కేబుల్ న్యూస్ ఇంకా మొదలు కాలేదు.

'సమయానికి వచ్చావురా బాబు' అనుకుంటూ అతడితో మాటలు కలిపాను. శృతి బెడ్ రూంలోకి వెళ్లిపోయింది.

'మేము ఓ కఠినమైన నిర్ణయం తీసుకున్నాం రా...' టీవీ చూస్తూ అన్నాడు వాసు.

ఏమిటని నేను అడిగే లోపునే 'రాజు పరీక్షలయ్యే వరకు ఏ ఊరికీ వెళ్లకూడదనుకున్నాం. ఎవరినీ ఇంటికి పిలవకూడదనుకున్నాం. వాడికి ట్రిబుల్ ఐటీ టార్గెట్ పెట్టాం. హోం ట్యూషన్ కూడా... అన్నాడు.

ఆ మాటలు విని 'అలా చెప్పన్నయ్యా...' అంటూ వాడి ముందే సుధ నాలుగు దులుపుతుందను కున్నాను. అలా జరగ లేదు. మౌనంగా రెండు టీ కప్పులు తెచ్చి మాముందుంచి వెళ్లిపోయింది.

'మీ కేంరా... పంతుళ్లు. అదృష్టవంతులు. ఏ చదువు చదివించాలి. ఎలా చదివించాలి. ఎక్కడ చదివించాలి బాగా తెలిసిన వాళ్లు. మాకు చదువంటే తెలియదు' అన్నాను.

'తెలిసిన వాళ్లు చెబితే వినాలి గదా!' సుధ గొనిగింది.

వాసు నవ్వుతూ 'రెవెన్యూ వాళ్లు డబ్బు బాగా సంపాదిస్తారు. అది చాలు. కోటి విద్యలు కూటి కోసమే!' అన్నాడు.

'అది ఉన్నా బాగుండు' సుధ అన్నది. టీ తాగుతూ వాడు చానల్స్ మారుస్తున్నాడు.

సుధ వంట చేస్తూంది.

వాసు ఏదో ఒకటి మాట్లాడుతున్నాడు. విషయం సూరి కొడుకు మీదికి మళ్లింది.

'వాడు అప్పుడే పెద్దవాడై పోయాడురా... కాలేజీలో ఎవరో అమ్మాయికి ఉత్తరం రాసాడట. పెద్ద గొడవ' అన్నాడు.

నాకు సురేందర్ గుర్తుకొచ్చాడు. కనపడ్డప్పుడల్లా ఒక్కటే మాట. 'ఈ కండక్టర్ జాబుతో మిగిల్చు కున్నదేం లేదురా... పిల్లలు బాగా చదువుతున్నారు. అదొక్కటే' అని.

'అరే సురేందర్ అమాయకుడురా.... వాడు ఎన్నోఆశలు పెట్టుకున్నాడు. తండ్రికి తలవంపులు తెచ్చే కొడుకులు ఎందుకురా పుట్టి' అన్నాను.

వాసు నా వైపు చూసి నవ్వి 'వాడు బ్రిలియంట్‌రా బాబూ.... ప్రీవియస్‌లో నైన్టీ సెవెన్ పర్సెంట్ ఆప్షనల్స్‌లో బైకి బై.... కాలేజీ వాళ్లు స్టేట్‌ర్యాంక్ ఊహిస్తున్నారు. మన పిల్లలున్నారు...చ' అన్నాడు.

'సిన్సియర్‌గా చదువుకునే మన పిల్లలు చెడ్డ వాళ్లు ఎలా అవుతారు' అని నేను అనబోతుంటే సుధ బయటకు వచ్చి 'చదువు... చదువు ముఖ్యం.... ఎవరైనా ఎంత పర్సెంట్ వచ్చిందని అంటారే కాని ఏమి చేసాడని అడగరుగా...' అన్నది.

ఇక నేనేం మాట్లాడినా దులిపేస్తుందని మౌనంగా ఉన్నాను.

మాటల మధ్యలో వాసు శంకర్ కొడుకు గురించి చెప్పాడు. 'మన శంకర్ కొడుకు అంతే! వాని కంట్లో పడ్డది మాయం. బంధువులింటికి వెళ్తే మొహం ముందే చెబుతారట. ఏదీ మాయం చెయ్యకమని. ఆఖరుకు తండ్రి పర్సులో డబ్బు కూడా...'

ఒకసారి శంకర్ తల్లికి కొడుకుతో డబ్బు పంపితే ఆ డబ్బుతో వాడు పట్నం బస్సు ఎక్కిన సంఘటన గుర్తుకు వచ్చింది. జాలివేసి 'ఇప్పుడు వాడు చిన్న పిల్లవాడు కాదు ఇంటర్. ఇప్పటికీ వాడు ఆ లక్షణం మరువలేదంటే వాని భవిష్యత్తును ఊహించుకుంటేనే భయం వేస్తుంది' అన్నాను. ఈసారి వాసు నన్ను వెర్రివాన్ని చూసినట్టుగా చూసి 'వాడు కాలేజి ఫస్ట్‌రా బాబూ... దటీజ్ గ్రేట్' అన్నాడు.

కేబుల్ టీవీలో ప్రకటనలు మొదలయ్యాయి. పుట్టిన రోజు శుభాకాంక్షలు చెబుతున్నారు. అది సరి కాదని నేను వాదన మొదలు పెట్టాను. వాసు విశ్లేషణ ముందు నా వాదన నిలువలేదు.

సుధ వాళ్ల అక్క విషయంలో నెల రోజుల కింద సుధకు నాకు ఇలాంటి వాదనే జరిగింది. ఆమె బాత్‌రూంలో జారిపడి మంచం పట్టింది. వాళ్ల అమ్మాయి ఇంజనీరింగ్ చదువుతూంది. తల్లి వద్దే ఉండి సేవలు చేసింది.

'నాకేం ఫరవాలేదు. నువ్వు హాస్టల్‌కు వెళ్లిపో...' తల్లి.

'మాకు నువ్వు ముఖ్యం. కోలుకున్నాకే వెళ్లిపోతా' కూతురు.


ఎవరు చెప్పినా వినలేదా పిల్ల. అటు అన్నకూ ఇటు అక్కకు సుధనే పెద్దగురువు. వెంటనే అక్క నుంచి ఫోన్. ఆ అమ్మాయి సరిగానే ఆలోచిస్తుంది అన్నాను సుధతో. ఇక్కడ నన్ను అక్కడ దాన్ని నాలుగు దులిపి హాస్టల్‌లో వదిలి వచ్చింది.

వార్తలు మొదలు కావడంతో మా మాటలు ఆగిపోయాయి.

నేత కార్మికుల ర్యాలీ చూపించారు. వాసు బ్యానర్ పట్టుకుని ముందే ఉన్నాడు. తర్వాత ఫిఫ్త్ సెప్టెంబర్ నిరసన గురించి వాసు స్టేట్‌మెంట్, ఉపాధ్యాయుల కోరికలు తీర్చకపోతే సమ్మె తప్పదని హెచ్చరిస్తున్నాడు.

టీవీలో ఫొటో చూసుకుని వాసు గర్వంగా వెళ్లిపోయాడు.

అప్పటికి సుధ శాంతించింది. ఆమెలో ఉన్న గుణం అదే! కొంతవరకు బెట్టు చేస్తుంది. మనం పట్టు జారిపోతున్నామని తెలిసిందా. దిగి వచ్చి మనకు నిబంధనలు పెడుతుంది. జూన్‌లో అదే జరిగింది. నేను హాస్టల్‌కు వెళ్లడాన్ని వ్యతిరేకిస్తే 'అయితే మనం టీవీ కట్టేద్దాం. మన అమ్మాయి కూడా టెంతే గదా, మనకు మాత్రం టార్గెట్లు ఉండవా.... ట్రిబుల్ ఐటి కాకపోయినా కనీసం ఫైవ్ హండ్రెడ్ దాటితే ఫీజ్ కన్సెషన్ దొరుకుతుంది. ఒక టైంటేబుల్ పెట్టుకుందాం. ఇంగ్లీష్ మీరు చెప్పండి. సైన్స్ మాథ్స్‌లో నేను హెల్ప్ చేస్తాను. మీరేం చేస్తారో నాకు అనవసరం. క్వార్టర్లీలో ఇంగ్లీష్‌లో ఫిఫ్టీ పర్సెంట్ రావాలి. సైన్స్ మాథ్స్ పూచీ నాది. ఆఫియర్లీ వరకు అన్ని సబ్జెక్టులు కవర్ చేద్దాం' అంటూ ఎమర్జెన్సీని తలపించే నిబంధనలు చెప్పింది సుధ. అది అమలు కాలేదు.



ఇప్పటికి ఆమె శాంతించడమే గొప్ప అన్నట్టుగా నేను మౌనంగా ఉన్నాను. కాని మనసంతా శృతి మీదే ఉంది. బెడ్ మీద అది ముడుచుకుని పడు కుంది. అది పుట్టాకే జాబ్ రావడం, జీవితానికో స్థిరత్వం రావడం అదో సెంటిమెంట్‌గా నాటుకుపో యింది. అంతకు మించి అది అచ్చం మానాన్న పోలికే! మా కుటుంబాల్లో ఎవరికి ఏం జరిగినా ముందుగా ఏడ్చేది అదే! సుధ మెల్లిగా హాస్టల్ ప్రస్తావన తెచ్చింది.

నేను మౌనంగా ఉన్నాను. సుధ నా నిర్ణయం కొరకు ఎదురుచూస్తూంది. నేను అవును కాదు అని ఏదీ చెప్పలేదు. చెప్పాలన్న ఆలోచన కూడా రాలేదు. వెళ్లి శృతిని భోజనానికి లేపాను.

సుధ నన్నే గమనిస్తూంది. కోపంగా 'ఒక్క పూట తినకపోతే ఏమీ కాదులే' అన్నది.

శృతి మరింత ముడుచుకుని పడుకుంది.

ఆ రాత్రి శృతి నా గుండె మీదనే నిద్రపోయింది. సుధ మొహం ముడుచుకుంది. కింద చాప వేసు కుని పడుకుంది. అర్ధరాత్రి పూట నా చెంపల్ని తడుము తుంటే మెలకువ వచ్చింది.

పక్కనే కూర్చుంది శృతి. కంటి నుండి కారు తున్న నీటి బొట్లు బెడ్‌లైట్ వెలుతురులో ముత్యాల్లా మెరుస్తున్నాయి.

'నన్ను హాస్టల్‌లో వెయ్యకండి నాన్నా... రాత్రి మీరు పక్కన లేకుంటే భయం వేస్తుంది. ప్రామిస్ నాన్నా... క్వార్టర్లీలో ఫస్ట్ తెచ్చుకుంటాను... ప్లీజ్ నాన్నా...' వెక్కుతూ అన్నది.,

దాని కళ్లలో భయం. మాటలో వణుకు.

నా నవనాడులు చల్లబడి పోయాయి. రోమాలు నిక్కబొడుచుకున్నాయి. హృదయం ఉప్పొంగింది. 'ఇదే నీ బలహీనత' అని సుధ చెప్పిన మాటలు గుర్తు కొచ్చాయి. కటువుగా ఉండాలని ప్రయత్నించాను.

'ప్రామిస్ నాన్నా... తప్పక తెచ్చుకుంటాను. రోజూ రాత్రి పన్నెండు వరకు చదువుకుంటాను. మార్నింగ్ ఎప్పుడు లేపితే అప్పుడు లేస్తాను. తాతయ్య ఇంటికి పోనే పోను. తమ్ముడితో ఆడు కోను...' ఇంకేవో చెబుతుంది.

సుధ హితబోధ, నా నిర్ణయాలు, అది చదవడం లేదనే భయం, ఆవేశం.... అన్నీ దాని కన్నీటికి కరిగి పోయాయి. నా కళ్లల్లో నీళ్లు తిరిగాయి. ఆర్తిగా గుండెకు హత్తుకున్నాను. బాగా చదవకుంటే హాస్ట ల్‌లో వేస్తానని హాస్టల్ జీవితం భయంకరంగా ఉంటుందని అప్పటికే సుధ ఎన్నో సార్లు దానికి భయం చెప్పింది.

నేను ఓదారుస్తున్నాను. శృతి ఏడుస్తూంది. సుధ నిద్ర లేచింది. కోపంగా దుప్పటిని ముడుచుకుని పడుకుంది. పేరెంట్స్ మీట్‌కు నేనే వస్తానని మాట ఇచ్చేదాక అది ఏడుపు ఆపలేదు.

తెల్లవారింది. సుధ ముభావంగా ఉంది. అంత కంటే ఎక్కువ దిగులుగా ఉంది. రాత్రి నేనిచ్చిన మాటతో శృతి కొంత ధైర్యంగా ఉంది. తల్లితో మాట్లాడ్డం లేదు. తన పనులు తాను చేసు కుంటూంది. బ్యాగు సర్దుకుంది. జడ వేసుకుంది. తల్లితో లెక్కలేనట్టే చూస్తూంది.

సుధ ఓ కంట ఇదంతా గమనిస్తూనే ఉంది. అందుకు కారణం నేనే అన్నట్టు నావైపు కొరకొర చూస్తూంది. నేను రెడీ అయి 'సుధా పేరెంట్స్ మీట్‌కు నువ్వువెళ్తావా... నేను వెళ్లనా...?' అన్నాను.

నా వైపు చూడకుండానే 'అవసరం లేదు. రేపు వెళ్లి టి.సి. తెస్తాను. కరీంనగర్ హాస్టల్‌లో వేద్దాం. మంచి ర్యాంక్ స్కూల్' అన్నది సుధ.

శృతి వణికిపోతూ నా వైపు చూసింది.

'సుధా..... అవసరమా... పైగా బోలెడు ఫీజులు' నసిగినట్టుగా అన్నాను.

కోపంతో ఇంతెత్తు లేచింది సుధ. అంతవరకు ఆణి చిపెట్టుకున్న కోసం ఒక్కసారిగా కట్టలు తెంచుకుంది.

'మీకు చదువు ముఖ్యమా.... డబ్బు ముఖ్యమా... ఇప్పటికే మీమూలంగా పిల్లలెంతో నష్ట పోయారు. ఇల్లని తల్లని ఊరు నుండి కదల్లేదు. అది పదిలో అంతంత మాత్రంగానే పాసయింది. ఇది ఇలా తయారయింది. ఆరునూరైనా దీన్ని హాస్ట ల్‌లో వేసుడే!' అన్నది గట్టిగా.

శృతి నమ్మకాన్నంతా నా మీద వేసి భయం భయంగా దిక్కులు చూస్తూంది.

సుధ ఏడాది కింద ఇలాగే 'మీకు చదువు ముఖ్యమా ఇల్లు ముఖ్యమా' అని పట్టు సాధించు కుంది. ఇప్పుడు అదే నమ్మకంతో ఉంది.

నేను తిండికి కూర్చున్నాను. సుధ బయటకు వెళ్లి కూర్చుంది. నాకన్నీ శృతే సర్దింది. పాలమారితే పరుగెత్తుకొచ్చింది. నీళ్లిచ్చి తల నిమిరింది.

ఇద్దరం స్కూల్‌కు బయలుదేరాం. సుధ మమ్మల్ని కోపంగా చూసి ఇంట్లోకి వెళ్లింది. అలవాటుగా 'మమ్మీ... బై' అనబోతూ నాలిక కరుచుకుంది శృతి.

ఇద్దరం స్కూల్‌కు చేరుకున్నాం. ఎల్ ఆకారంతో మూడంతస్తుల బిల్డింగ్ అది. ముందు చిన్న ప్లేయర్ గ్రౌండ్. పెద్ద రౌండ్ టెంట్ వేసారు. స్టేజి అరేంజ్ చేసి కుర్చీలు వేసారు.

స్కూల్ సెలక్షన్ నుంచి మీటింగ్స్ వరకు అంతా సుధనే చూసుకుంది. ఇప్పుడు నాకు కొత్తగా ఉంది. ప్రిన్సిపల్ రూంలోకి వెళ్లి నన్ను నేను పరిచయం చేసుకున్నాను. అతడు నా వైపు నిరాసక్తిగా చూసి 'కొద్దిగా కష్టపడాలి సార్... అమ్మాయిలో ఇంప్రూవ్ వెంట్ లేదు...'' అన్నాడు.

శృతి నా వెంటే ఉంది. నాకేం చెప్పాలో తోచ లేదు. నేను అనాల్సిన మాట అది. తర్వాత ఒకా యన వచ్చాడు. ప్రిన్సిపల్ నవ్వుతూ సాదరంగా ఆహ్వానించాడు. తన కొడుకును ఎలా చదివిస్తు న్నది అతడు చెబుతున్నాడు. స్పెషల్ కోచింగ్ ఎలా ఇస్తున్నది ప్రిన్సిపల్ చెబుతున్నాడు.

నేను బయటకు వచ్చాను. అక్కడ పేరెంట్స్ నాకు రెండు గ్రూపులుగా కనిపిస్తున్నారు. కొందరు గర్వంగా తిరుగుతున్నారు. కొందరు దిగులుగా ఉన్నారు.

శృతి నావెంట పిల్లికూనలా తిరుగుతూంది. దానికి ఎక్కువ మంది ఫ్రెండ్స్ కూడా లేనట్టు న్నారు. ఒకరిద్దరు పొడిపొడిగా పలకరించారంతే! కొందరు పిల్లలు స్కూలంతా తమదేనన్నట్టు జట్లు కట్టి హుషారుగా తిరుగుతున్నారు. కొందరు పేరెంట్స్ వెంట నక్కినక్కి తిరుగుతున్నారు.

అందరూ కూర్చోవాలని మైక్‌లో అనౌన్స్‌మెంట్ వినిపించింది. నేను శృతి పక్కపక్కనే కూర్చు న్నాం. ప్రిన్సిపాల్ మైక్ ముందుకు వచ్చాడు. గొంతు సవ రించుకుని 'పే‌రె‌ంట్స్ మీట్‌ను ఈసారి వినూ త్నంగా నిర్వహించాలనుకున్నాం. మీరెంతో కష్టపడి పిల్లల్ని చదివిస్తున్నారు. అయినా కొందరు చద వడం లేదు. మీకూ పిల్లలకు కొన్ని గైడ్స్ కావాలి. పర్సనాలిటీ డెవలప్‌మెంట్ కోర్సుల్లో నిష్ణాతులైన ఇద్దరు ప్రొఫెసర్లను రప్పించాం..' చెప్పుకు పోతు న్నాడు ప్రిన్సిపాల్.

నాకు ఆ మధ్య జరిగిన లీడ్ ఇండియా 2020 ప్రోగ్రాం గుర్తుకు వచ్చింది. కలెక్టర్ గారి ఆదేశాల మేరకు డివిజన్‌లో ఉపాధ్యాయులకు రెసిడెన్స్ ప్రోగ్రాంగా మేమే దానిని నిర్వహించాం. అబ్దుల్ కలాం రూపకల్పన చేసాడనగానే నాకు ఆసక్తి కలి గింది. తప్పకుండా వినాలనుకున్నాను. ప్రోగ్రాం ఉద్దేశా లను వివరిస్తూ ఒక ఆచార్యుడు 'అభివృద్ధి చెందిన దేశాల్లో పిల్లల్ని కనే ఓపిక, తీరిక లేదని, మానవ వన



## కత్రినా, రణబీర్ ప్రేమికుల రోజు?

మొన్నటి దాకా సల్మాన్‌ఖాన్‌ను అంటిపెట్టుకొని తిరిగి, అతని చేత ఖరీదైన వాలంటైన్ గిఫ్ట్‌కూడా ఇప్పిం చుకొన్న కత్రినా తన మనసు మార్చుకున్నట్లు ఉంది. ఈ వాలంటైన్ డేను తన సహ నటుడు రణబీర్‌తో సెలబ్రేట్ చేసుకోవడానికి ప్లాన్ చేస్తోందట! ఆరోజు కత్రినాకు ఖరీ దైన డిన్నర్ ఇవ్వడానికి రణబీర్ ప్రయత్నాలు ముమ్మరం చేస్తుంటే...సల్మాన్ ఖాన్ మాత్రం షూటింగ్ హడావుడిలో ఉన్నాడట! ఆరోజు కత్రినాకు టర్కీలో షూటింగ్ ఉందట! అయితే సల్మాన్‌ఖాన్‌కి కూడా 'లండన్ డ్రీమ్స్' షూటింగ్ ఆసిన్‌తో ఉంది. అయితే ఈ వాలంటైన్ డేను సల్మాన్ ఆసి న్‌తోనూ, కత్రినా రణబీర్‌తోనూ గడుపుతారని పరిశీల కులు అంటున్నారు.

రుల కోసం వారంతా ఇండియాపైనే ఆధారపడతారని రాబోయే కాలంలో మల్టి నేషన్ కంపెనీల్లో భారత పిల్లలకి ఎక్కువ అవకాశం ఉంటుందని పిల్లలు బాగా చదువుకొని ఎదగాలని' చెప్పాడు.

అందరు చప్పట్లు కొట్టారు.

నాకు ఉద్వేగంగా అనిపించింది. నా ఇద్దరు పిల్లలను బాగా చదివించి పెద్ద ఉద్యోగాలు చేయించాలనుకున్నాను.

అప్పుడు ఓ ఉపాధ్యాయుడు లేచి ''మల్టీనేషన్ కంపెనీలకు బానిసలను తయారు చేయడానికా మన చదువులు. ఇది లీడ్ ఇండియానా... లీవ్ ఇండియానా...'' అని ప్రశ్నించాడు.

పెద్ద చర్చనే జరిగింది. తలో మాట.

'పెద్ద ఉద్యోగస్తులంటే బానిస అంటాడేంటీ' అని ఆ టీచర్ మీద నాకు కోపం వచ్చింది.

రెండో రోజు 'ఆప్ బడో... దేశ్‌కో బడావో' అని నినాదమిచ్చాడు ఆ ప్రొఫెసర్.

'బడో' అనే పదం మీద పెద్ద చర్చను లేవదీసారు ఉపాధ్యాయులు. ఎదగడం అంటే ఏమిటి....? నెలకు రెండు మూడు లక్షలు సంపాదిస్తే ఎదిగినట్టేనా...? అన్నది వారివాదన. కొందరు అవునన్నారు. కొందరు కాదన్నారు. గందరగోళంగా ముగిసిందా ప్రోగ్రాం.

పర్సనాలిటీ డెవలప్‌మెంట్ క్లాస్ మొదలయింది. ఏ చదువులు చదివితే ఏ ఉద్యోగాలున్నాయో.... ఎంత సంపాదించవచ్చు చెబుతున్నారు. ఎంత పట్టుదలగా చదవాలో.... అలా చదివిన వ్యక్తులు ఎవరో... వారు దేన్ని కోల్పోయి దేన్ని సాధించారో చెబుతున్నాడు.

శృతిని చూసాను. శ్రద్ధగా వింటూంది. పేరెంట్స్, పిల్లలు చాలా నిశ్శబ్దంగా ఉన్నారు. ఆసక్తిగా వింటున్నారు. ప్రొఫెసర్ మాటలు డబ్బు, అవకాశాల చుట్టే తిరుగుతున్నాయి.

నాకు విసుగువచ్చింది. పక్కనున్న వ్యక్తి వైపు చూస్తూ 'ఏ చదువు చదివితే ఎంత సంపాదించవచ్చో చెబుతున్నాడే తప్ప ప్రజలకు ఎలా మేలుచేయవచ్చో ఒక్క మాట చెప్పడం లేదు' అన్నాను.

అతడు నా వైపు విసుగ్గా చూసాడు.

శృతికి ఏ రకంగా అర్థమైందో... విప్పారిన మొహంతో నావైపు చూసింది.

చివరగా ఎంతమంది పిల్లలు డాక్టర్లు కావాలనుకుంటున్నారో చేతులెత్తమన్నాడు. చాలామందే చేతులెత్తారు. శృతి నావైపు చూసి తలదించుకుంది. తర్వాత కొంతమంది పేరెంట్స్ చదువు గురించి, పిల్లల పట్ల వహించాల్సిన శ్రద్ధ గురించి మాట్లాడారు.

మీటింగ్ తర్వాత తిరిగి వస్తుంటే ప్రిన్సిపల్ నుంచి పిలుపు. గదిలోకి వెళ్లాను. శృతి బయటనే నిలబడింది. తప్పంతా నాదే అన్నట్టు హితబోధ చేసాడు ప్రిన్సిపాల్. క్వార్టర్లీలో కనీసం సెకండ్ క్లాస్‌రాకపోతే ఆన్యువల్‌కు ప్రైవేట్లోనే ఫీజు కట్టాలని హెచ్చరించాడు. నాకు అవమానంగా అనిపించింది.

బయటకు వచ్చాను. పిల్లలు, పేరెంట్స్ ఆత్మస్థైర్యాన్ని నింపుకొని వెళ్తున్నారు. శృతి నావైపు భయం భయంగా చూసింది.

ఇంటికి వచ్చేసరికి మూడు దాటింది. నాకు చిన్నగా తలనొప్పి మొదలయింది. సుధ మా మొహమే చూడలేదు. ఎవరం ఎవరితో మాట్లాడుకోలేదు. నా అవస్థను గమనించి శృతి టీ పెట్టిచ్చింది.

నేను బయటకు వెళ్లి చిన్నచిన్న పనులు చూసుకుని సాయంత్రం ఇంటికి వచ్చాను. వాతావరణంలో ఏదో మార్పు. టీ గ్లాసులు వాటర్ బాటిల్ చూసి మా బావ మరిది వచ్చాడని ఊహించాను.

సుధ తేలికగా ఉంది. కళ్లలోకి చూస్తే నవ్వుతూ మాట్లాడేట్టుగా ఉంది. శృతి మాత్రం దిగులుగా హోం వర్క్ చేసుకుంటూంది.

నాకు తలనొప్పి తగ్గలేదు. జండూబాం కొరకు చూస్తుంటే శృతి వెదికి ఇచ్చింది. ఆ రాత్రి సుధ ఏదో చర్చ పెడుతుందనుకున్నాను. అలా జరగలేదు. ఎవరికి వారు అన్నం తిని పడుకున్నాం. శృతి నా పక్కనే పడుకుంది. కండ్లు మూసుకుంది కాని నిద్రపోలేదు. తలనొప్పితో నాకు నిద్ర పట్టడం లేదు. సుధ మాత్రం గుర్రుపెట్టి నిద్రపోతూంది.

తల్లి నిద్రపోయిందని తెలిసాక నావైపు తిరిగి 'నాన్నా' అంది శృతి.

ఎంతో వేదనను రంగరించినట్లు ఆ పిలుపు నా గుండెను కెలికింది. ఏమిటన్నట్టు చూసాను. బాగానే చదువుతున్నాను నాన్నా... ఎందుకో గుర్తుండడం లేదు' అన్నది. దుఃఖాన్ని అణచి పెట్టుకున్నట్టు దాని గొంతులో జీర.

నేను మౌనంగా దగ్గరికి తీసుకున్నాను. చేతి స్పర్శ తప్ప మాట్లాడ్డానికి నా వద్ద మాటల్లేవు. అదీ కొంతసేపు మౌనంగా నా గుండె మీద ఒరిగిపోయింది. తర్వాత నెమ్మదిగా 'నాన్నా... నేను హాస్టల్‌కు వెళ్తాను రేపు మామయ్య తీసుకెళ్తాడట' అన్నది.

నేను అదిరిపడి చూసాను. నా కళ్లల్లో నీళ్లు తిరిగాయి. దాన్ని మరింత దగ్గరగా తీసుకున్నాను. జీవితంలో ఇంకోసారి ఆ అవకాశమే రాదన్నట్టు అది నన్ను బల్లిలా కరుచుకుపోయింది. ఆర్తిగా నా చెంపల్ని తడుముతూ 'నా మూలంగా మీకు అవమానం, ఇబ్బంది కదా' అన్నది.

నేను ఎందుకని అడగకముందే 'మమ్మి ఇక నుంచి స్కూల్‌కు రానే రానంది. ఇంట్లో కూడా ఉండ నంది. మనతో మాట్లాడనంది' చెప్పింది.

ఆ మాటల్ని పూర్తిగా జీర్ణించుకుని... నిర్ణయం తీసుకున్నట్టుగా ఉంది. దాని గొంతు ఒక్కొక్క మాట నా హృదయం లోకి తూటాల్లా దిగిపోయాయి. ఒళ్లు జలదరించింది. దాన్ని రెండు చేతులతో అదిమి పట్టుకుని 'నువ్వెక్కడికీ వెళ్లనవసరం లేదురా... ఇక్కడే ఉంటావు' అన్నాను.


ఎప్పుడు నిద్ర లేచిందో సుధ. నా మాటలు విని గయ్యిమంది. 'మీకు చదువు విలువ తెలియదు. నాకు మాత్రం దానిమీద ప్రేమ లేదా? మనకు పిల్లల భవిష్యత్తు ముఖ్యం. చదువు లేకుండా వాళ్లకు భవిష్యత్తు ఎక్కడిది. పిచ్చి పిచ్చిగా మాట్లాడి దాని మనసు పాడు చేయకండి' అన్నది కోపంగా.

శృతి ఉల్కిపడి భయంతో బిగుసుకుపోయింది. అది నా సమాధానం కోసం ఎదురు చూడడంలేదు. అంత స్థిరంగా నిశ్చయించుకుంది.

నేను సుధ వైపు చూసాను. కోపంతో లేచి కూర్చుంది. నేనూ లేచి కూర్చున్నాను. 'రేపు మన కూతురు పెద్దపెద్ద ఉద్యోగాలు చేయకపోవచ్చు. ఒక మంచి మనిషిగా మాత్రం జీవిస్తుంది. నువ్వన్నట్టు స్కూల్ ప్రోగ్రెస్‌లో సబ్జెక్టులతో పాటు స్పందనలకు కూడా మార్కులుంటే శృతికి మొదటి ర్యాంకు వచ్చేది' అన్నాను.

దాన్ని అల్లుకున్న నా చేతులు మరింతగా బిగిసుకున్నాయి.

*





చిరునామా:
పెద్దింటి అశోక్‌కుమార్,
ఇ.నెం.12-7-36, శివనగర్, సిరిసిల్లా,
కరీంనగర్ జిల్లా. సెల్ : 9441672428